సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ¦ 4 ¦ జూన్ ¦ 2025



మ్యూజియం.. చూద్దాం రండి..!

భద్రాచలంలోని గిరిజన మ్యూజియానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడి వంటకాలు, వస్తువులు అలరిస్తున్నాయి. 8లో



మలేరియాను తరిమికొట్టాలి..

జిల్లాలో ఇప్పటివరకు 20 మలేరియా కేసులు నమోదు కాగా, వ్యాధి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రం అవుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

డివిజన్ల ప్రక్రియ ఎప్పుడో..?



అశ్వారావుపేట మున్సిపల్ కార్యాలయం

అశ్వారావుపేట: నూతనంగా ఏర్పాటైన అశ్వారావుపేట మున్సిపాలిటీతో పాటు కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన కొత్తగూడెంలో డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ రెండో చోట్లా మంగళవారమే డివిజన్ల కేటాయింపు జరగాల్సి ఉంది. అయితే కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు అశ్వారావుపేట మున్సిపాలిటీకి కమిషనర్‌గా సుజాత ఒక్కరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆమె ఏ మున్సిపాలిటీలోనూ అందుబాటులో ఉండరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీల్లో వార్డుల ఏర్పాటు, సవరణ జాబితాను మంగళవారం ప్రకటించాలి. దీనిపై అభ్యంతరాల స్వీకరణ, విచారణ పూర్తయ్యాక తుది జాబితా విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా మొదటి రోజు ప్రక్రియే చేపట్టలేదు. పాలనాపరమైన అంశాల్లో కార్యాలయ సిబ్బంది సైతం జోక్యం చేసుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. అశ్వారావుపేట మున్సిపాలిటీలో గుర్రాలచెరువు, పేరాయిగూడెం, పూర్వ అశ్వారావుపేట గ్రామ పంచాయతీలు ఉండగా ఏ వార్డు ఎక్కడ మొదలవుతుంది.. ఎక్కడ ముగుస్తుంది.. ఇలా 23 వార్డుల సమగ్ర సమాచారం కోసం పట్టణ వాసులు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు.

14 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం) : సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న 14 మంది మైనింగ్ (సేఫ్టీ) అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఐదుగురు డిప్యూటీ జీఎంలు, ఒక కాలరీ మేనేజర్, ముగ్గురు అడిషినల్ మేనేజర్లు, ఇద్దరు ఎస్ఈలు, ఇద్దరు సీనియర్ అండర్ మేనేజర్ స్థాయి అధికారులు ఉన్నారు. కాగా, వీరంతా ఈనెల 14వ తేదీన కేటాయించిన ఏరియాల్లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..



ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురంలో సాగుతున్న యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు

అడుగు ముందుకు పడని 'యంగ్ ఇండియా'

- ఖమ్మం జిల్లాలో శరవేగంగా సాగుతున్న పనులు
- మంజూరుతోనే సరిపెట్టుకున్న భద్రాద్రి జిల్లా..
- పలుచోట్ల కొలిక్కి రాని స్థల సేకరణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'రేవంత్‌రెడ్డి పేరు చెబితే యంగ్ ఇండియా స్కూళ్లు గుర్తొస్తాయి' అని సీఎం ఇటీవల గర్వంగా ప్రకటించుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలకెత్తుకున్న యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం జిల్లాలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది.

అంతా ఒకేచోట..

తెలంగాణ వచ్చిన తర్వాత కేజీ నుంచి పీజీ విద్యలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వేర్వేరుగా గురుకుల పాఠశాలలు నియోజకర్గానికి ఒకటి చొప్పున ప్రారంభించారు. ఈ గురుకులాల్లో చాలా వరకు ఇప్పటికీ అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్యనే కొనసాగుతున్నాయి. అయితే సామాజికంగా అందరినీ ఒకే చోట కలుపుతూ సమానత్వం తెచ్చే లక్ష్యంతో సకల హంగులతో అన్ని గురుకులాలను ఒకే చోట నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి యంగ్ ఇండియా స్కూళ్లుగా పేరు పెట్టింది. గతేడాది అక్టోబర్‌లో తొలి విడతగా 18 యంగ్ ఇండియా స్కూళ్లకు శంకుస్థాపన చేయగా ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు, మధిర నియోజకర్గాలకు చోటు దక్కింది.

జిల్లాకు ఐదు మంజూరు

మలి విడతలో భాగంగా ఈ ఏడాది మార్చి 8న ప్రభుత్వం 55 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా స్కూళ్లు మంజూరు చేసింది. ఇందులో ఇల్లెందు, పినపాక, కొత్తగూడెం నియోజకర్గాలకు స్థానం దక్కింది. కాగా ఇటీవల అశ్వారావుపేట, భద్రాచలం నియోజకర్గాలకు కూడా మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణానికి కనీసం 20 నుంచి 25 ఎకరాలు అవసరం పడుతుంది. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు చేయనుంది. మొత్తంగా ఐదు స్కూళ్లకు రూ.1000 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా ఈ స్కూళ్లు నడవనున్నాయి.

స్కూళ్లకు స్థల సమస్య..

జిల్లాకు మూడు యంగ్ ఇండియా స్కూళ్లు మంజూరై దాదాపు మూడు నెలలు కావొస్తున్న ఇప్పటివరకు మణుగూరు, కొత్తగూడెం మినహా మరెక్కడా స్థల సేకరణ పూర్తి కాలేదు. ఇల్లెందు నియోజకర్గానికి మంజూరైన యంగ్ ఇండియా స్కూల్ కోసం బైపాస్ రోడ్డులో 25 ఎకరాల స్థలం గుర్తించారు. అయితే ఇది వివాదంలో ఉండటంతో స్థల సేకరణ అంశం ఎంతకీ తేలడం లేదు. మరో ప్రత్యామ్నాయ స్థలం చూసేందుకు స్థానిక రాజకీయ నాయకులు సుముఖంగా లేరు. దీంతో ఈ విషయంలో పీటముడి బిగుసుకుంది. కొత్తగూడెంలో రెండేళ్ల క్రితం సింగరేణి సంస్థ భారీ ఎత్తున భూములను రెవెన్యూ శాఖకు బదిలీ చేసింది. పట్టణంలోని గోధుమ వాగు సమీపంలో ఇలా కేటాయించిన భూములను యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే ఇక్కడ టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. మణుగూరులో పట్టణ పరిధిలో 20 ఎకరాలను రవాణా శాఖ కేటాయించినా.. ఆ తర్వాత ఈ అంశంపై స్తబ్దత నెలకొంది. ఇక అశ్వారావుపేట, భద్రాచలంలో ఇప్పటికే స్థల సేకరణ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో యంగ్ ఇండియా స్కూళ్లు ఎక్కడ నిర్మించాలనే అంశం ఎవరికీ అంతుపట్టడం లేదు.

బోనకల్‌లో శరవేగంగా..

గతేడాది అక్టోబర్‌లో బోనకల్‌లో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోనూ త్వరితగతిన స్థల సేకరణ, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పుడు పనులు మొదలుపెడితే కనీసం వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా యంగ్ ఇండియా ఫలాలు విద్యార్థులకు అందే అవకాశం ఉందని అంటున్నారు.

జీసీసీ కార్యాలయంలో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పాల్వంచ బ్రాంచ్ కార్యాలయాన్ని భద్రాచలం డీఎం సమ్మయ్య మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. 'అవతరణ వేళ.. జీసీసీ వెలవెల'శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి జీసీసీ డీఎం స్పందించారు. బ్రాంచ్ కార్యాలయ సముదాయంలోని గోదాంను పరిశీలించారు. రేషన్ దుకాణాలకు త్వరితగతిన బియ్యం రవాణాను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవతరణ రోజున విధుల్లో లేని వారికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి

వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట : ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగేలా చొరవ తీసుకోవాలని, ఈ మేరకు రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలోని గండుగులపల్లిలో మంత్రిని అధికారులు కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. పామాయిల్ సాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణను పామాయిల్ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. తక్కువ పెట్టుబడి, ప్రభుత్వ రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి పామాయిల్‌కు ఉన్నాయని, ఈ పంట సాగుతో స్థిర ఆదాయం పొందొచ్చని చెప్పారు. ఇవే అంశాలపై రైతుల్లో చైతన్యం కలిగించాలన్నారు. కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్, ఏఓలు చంద్రశేఖర రెడ్డి, శివరామ ప్రసాద్, అరుణ్‌బాబు, అనూష, వినయ్, నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, కోటగిరి బుచ్చిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



పర్యావరణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి 19 వరకు జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులక సూచించార. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. 6 నుంచి 14 ఏళ్ల మధ్య పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి తిరిగి పాఠశాలకు పంపించాలని, పిల్లలను బడికి పంపేందుకు ఇష్టపడని తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను గుర్తించి, రెండు వారాల్లో తగిన మరమ్మతులు చేయించాలని చెప్పారు. ఉపాధిహామీ పథకం ద్వారా అన్ని పాఠశాలలకు మట్టి ఇటుకలతో ప్రహరీలు నిర్మించాలని, భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సౌకర్యాలు అందించాలని ఆదేశించారు. 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాసం యాప్ ద్వారా వారికి అభ్యాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో సీడ్ బ్యాంకుల ద్వారా విత్తనాలు ఎక్కువగా సేకరించిన స్కూళ్లకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తులసి, ఉసిరి, చింత, వెలగ, మునగ, కరివేపాకు మొక్కలు నాటాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీఓ సంజీవరావు, మెప్మా పీడీ రాజేష్, డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి, బీసీ సంక్షేమాధికారి ఇందిర, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 405 మంది విద్యార్థులకు గాను 355 మంది హాజరయ్యారని, 50 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ నేతృత్వంలోని తనిఖీ బృందం మణుగూరు, భద్రాచలం సెంటర్లలో తనిఖీలు చేపట్టిందని తెలిపారు.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీ..

భద్రాచలంటౌన్ : జిల్లాలోని మణుగూరు, భద్రాచలం పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. మణుగూరులో 61 మంది, భద్రాచలంలో 58 మంది విద్యార్థులు హాజరు కాగా, 14 మంది గైర్హాజరయ్యారని బృందం సభ్యులు తెలిపారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం

- అన్ని ఏరియాల్లో నూతన గనుల సాధనకు ప్రయత్నాలు
- సంస్థ అభివృద్ధికి ఏరియా జీఎంలు ప్రణాళిక రూపొందించాలి
- బొగ్గు ఉత్పత్తి, నాణ్యతపై దృష్టి పెట్టాలి
- సింగరేణి సీఎండీ బలరామ్ దిశా నిర్దేశం



జయరాజును సత్కరిస్తున్న సీఎండీ బలరామ్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని సీఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంపెనీ విస్తరణ, సమస్యల పరిష్కారంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. ఓవర్‌బర్డెన్ తొలగింపులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన గనులు లేకపోతే ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి తదితర ఏరియాలకు భవిష్యత్ ఉండదని, కొత్త గనుల కోసం ముమ్మరంగా ప్రయత్నించాలని అన్నారు. అటవీ అనుమతులు సాధనలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. శాంతిఖని, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ల్లో నష్టాల నివారణకు ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు సత్తుపల్లిలో కోల్‌వాషరీ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్.వి. సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లుతో పాటు అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

ప్రజాకవి జయరాజుకు సన్మానం

సింగరేణి సంస్థ మాజీ ఉద్యోగి, ప్రజాకవి గొడిశెల జయరాజును కొత్తగూడెంలో సీఎండీ ఎన్.బలరామ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయరాజుకు ఇప్పటికే పలు అవార్డులు, పురస్కారాలు వచ్చాయని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నగదు బహుమతి అందిస్తూ తగిన గుర్తింపునివ్వడం హర్షణీయమని అన్నారు. సింగరేణి సంస్థలో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తూనే కార్మికుల, కర్షకుల కష్టాలపై స్పందించేవారని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అందరికీ అర్థమయ్యేలా పాటల రూపంలో వివరించేవారని తెలిపారు. సింగరేణి కార్మికులు నెల రోజుల పాటు చేసిన సమ్మెలో పాల్గొన్న జయరాజు.. ఎవరు ప్రలోభ పెట్టినా తన పంథా వీడలేదని చెప్పారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. సింగరేణి అందించిన సహకారం, ప్రోత్సాహం వల్లే తాను కవిగా, ఉద్యమకారుడిగా, ఉన్నత స్థాయికి చేరుకోగలిగానని చెప్పారు. కార్యక్రమంలో కోల్ మూమెంట్ డైరెక్టర్ ఎస్‌డీఎం సుభాని పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ములుగుమాడులో సదస్సు, సర్వేను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల



అభివాదం చేస్తున్న మంత్రులు, ఉన్నతాధికారులు

ఎర్రుపాలెం: రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా భూముల రీసర్వే చేపట్టనుండగా రైతులకు మేలు జరగడమే కాక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూముల రీ సర్వే, భూభారతి సదస్సును మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి మంగళవారం ప్రారంభించారు.

ఎవరిపై భారం పడకుండా సర్వే

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడమే కాక ఎవరికీ రూపాయి కూడా ఖర్చు లేకుండా భూముల రీసర్వే చేసి రికార్డులకు భద్రత కల్పిస్తామని భట్టి, మంత్రులు వెల్లడించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ధరణి చట్టం స్థానంలో భూభారతి తీసుకొచ్చామని తెలిపారు. తద్వారా ప్రతీ భూకమతానికి ఆధార్ కార్డు మాదిరి భూధార్ ఇస్తామని చెప్పారు. అంతేకాక ఏటా సదస్సులు నిర్వహించి అమ్మకాల, కొనుగోలు వివరాలను అప్‌డేట్ చేస్తామని తెలిపారు. భూ సంస్కరణల కారణంగా రాష్ట్రంలో దాదాపు 26లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేస్తే, గత పదేళ్లలో ఎక్కడా కమిటీలు కానరాలేదన్నారు. ఈనేపథ్యాన కొత్త చట్టంతో కమిటీలు ఏర్పాటు చేసి మిగులు భూములను ఇంటి పట్టాలుగా, సాగుకు పంపిణీ చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న భూమి కంటే ఎక్కువగా రికార్డుల్లో నమోదు చేయించి రైతుబంధు నిధులు కాజేశారని, ఇలాంటివి ఇక సాగవని స్పష్టం చేశారు. గ్రామ పాలనాధికారులు, లైసెన్సు సర్వేయర్ల నియామకంతో రైతుల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు.

త్వరలోనే రైతు భరోసా

ఈసంవత్సరం వరి నాట్ల కంటే ముందే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాగా, నక్షాలు లేకుండా రాష్ట్రంలోని 413 గ్రామాల్లో రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతుండగా తాజాగా చేపడుతున్న రీ సర్వేతో ఈ సమస్య పరిష్కారమవుతాయని వెల్లడించారు. కాగా, ధరణి చట్టంలోని లోపాలతో ఎదురైన ఇబ్బందులు పలువురు రైతులు వివరించారు. అనంతరం భూముల రీసర్వేతో లాభాలను సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో లాండ్ అండ్ సర్వే జేడీ ప్రసన్నలక్ష్మి, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ ఎం.ఉషాశారద, మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఖమ్మం డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి' సాగు దిశగా..



- ఆకాంక్ష పథకంలో జిల్లా ఎంపిక
- మార్గదర్శకాలను విడుదల చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ
- జిల్లాలో 22 క్లస్టర్లలో అమలుకు సన్నాహాలు
- క్లస్టర్‌కు 125 మంది చొప్పున రైతుల ఎంపిక పూర్తి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే జాతీయ మిషన్ ఏర్పాటు చేసింది. భద్రాద్రి ఇప్పటికే ఆకాంక్షిత జిల్లాగా ఎంపిక కావడంతో ప్రకృతి వ్యవసాయ జాతీయ మిషన్ పథకం అమలుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి మండలంలో ఒక క్లస్టర్ గ్రామాన్ని ఎంపిక చేసి 125 మంది చొప్పున రైతులను గుర్తించారు. వారి కమతాల్లో తొలుత 125 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తారు.

ఎంపికైన గ్రామాలు ఇవే..

జిల్లాలో భద్రాచలం మినహా మిగిలిన 22 మండలాల్లో క్లస్టర్ గ్రామాలను ఎంపిక చేశారు. ఆళ్లపల్లి, అశ్వాపురం, బూర్గంపాడు, చుంచుపల్లి, గుండాల, జూలూరుపాడు, కరకగూడెం, కొత్తగూడెం, మణుగూరు, పినపాక, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లెందు మండల కేంద్రాలతో పాటు అన్నపురెడ్డిపల్లి మండలం పెద్దిరెడ్డిగూడెం, అశ్వారావుపేట మండలం నారాయణపురం, చండ్రుగొండ మండలం పోకలగూడెం, చర్ల మండలం తేగడ, దమ్మపేట మండలం మామిడాలపల్లి, దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక, ములకలపల్లి మండలం పొగళ్లపల్లి, పాల్వంచ మండలం యానంబైలు గ్రామాలను క్లస్టర్లుగా ఎంపిక చేశారు.

జాతీయ మిషన్ ఎందుకంటే..?

వాతావరణంలో వస్తున్న మార్పులు, పంటలను ఆశిస్తున్న చీడపీడల ఉధృతి, క్షీణిస్తున్న నీటి లభ్యత, పంట ఉత్పత్తుల్లో తగ్గుదలను అధిగమిస్తూ ప్రస్తుతం ఆచరిస్తున్న వ్యవసాయ పద్ధతుల నుంచి క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మారేలా కృషి చేసేందుకు కేంద్రం జాతీయ మిషన్ ఏర్పాటు చేసింది.

దశలవారీగా..

మొదటి సంవత్సరంలో రైతులకు శిక్షణ, క్షేత్ర సందర్శన, ఇంటి పెరట్లో గృహావసరాలకు సరిపడా కూరగాయల సాగుతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభింపజేస్తారు. రెండు, మూడో సంవత్సరాల్లో ఆవుపేడ, మూత్రం సేకరించి జీవామృతం వంటి బయో ఉత్పత్తుల తయారీ, మల్చింగ్, అంతర పంటల సాగు పద్ధతులను అవలంబింపజేయడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన, నమ్మకం ఏర్పడి రైతు తన క్షేత్రంలో కొంత విస్తీర్ణంలో ఆచరణ మొదలు పెట్టేలా చర్యలు చేపడతారు. నాలుగు, ఐదో సంవత్సరాల్లో రైతుల భూమి మొత్తంలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభిస్తారు.

నాణ్యమైన పంట ఉత్పత్తుల కోసం..



జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై జాతీయ మిషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన, అధిక పంట దిగుబడులు వస్తాయి. తద్వారా పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుంది. ప్రజారోగ్యం సంరక్షణకు దోహదపడుతుంది. సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి.

–పి.రవికుమార్, అశ్వాపురం ఏడీఏ

ప్రకృతి వ్యవసాయంలో పంచసూత్రాలు..

- బీజామృతంతో విత్తన శుద్ధి
- నేల ఆరోగ్యం, నీటి యాజమాన్యం
- సంవత్సరం మొత్తం నేలను కప్పి ఉంచేలా పంటలతో లేదా వ్యర్థాలతో భూమి ఆచ్ఛాదన
- నేల సూక్ష్మ వాతావరణం, యాజమాన్యం
- పంటల ఆరోగ్య యాజమాన్యం

రైతులు సామూహికంగా ఆచరించాల్సిన పద్ధతులు..

- నేలలో సేంద్రియ పదార్థాల వృద్ధి
- నేలను దున్నకుండా లేదా కనీసస్థాయిలో దున్నడం ద్వారా పంటల సాగు
- వైవిధ్యంగా పంటల సాగు
- పశుపోషణను పంటల సాగుతో మిళితం చేయడం
- ప్రకృతి పద్ధతులతో చీడపీడల యాజమాన్యం
- కృత్రిమ రసాయనాల వాడకం నిషేధం
- వ్యవసాయ క్షేత్రంలోనే తయారు చేసిన సహజ బయో ఉత్పత్తుల వాడకం
- స్థానికంగా రూపొందించిన స్థానిక వాతావరణానికి తగిన పంట విత్తనాలను నాటడం

క్లుప్తంగా

సాయి మందిరానికి రూ.లక్ష విరాళం



దాతకు బాబావారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీసాయిబాబా మందిర అన్నప్రసాద షెడ్డు నిర్మాణానికి ఓ భక్తుడు రూ.లక్ష విరాళం అందించాడు. పట్టణానికి చెందిన దివంగత చెరుకూరి సత్యవాణి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు ఆలయ అధ్యక్షుడు కొమ్మనాపల్లి ఆదినారాయణకు మంగళవారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబసమేతంగా బాబావారిని దర్శించుకని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో చెరుకూరి మల్లికార్జునరావు, గొర్ల వెంకటేశ్వరరావు, శ్రీరామ్‌శర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పునరావృతం కాకుండా చర్యలు

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో పరమత వ్యాఖ్యలతో ఉన్న కవర్లు రావడం చాలా దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సంఘం అధ్యక్షుడు అన్నెం శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వస్త్రాలు విక్రయించే కాంట్రాక్టర్ స్క్రాప్ కవర్లను విక్రయించడం వల్లే ఈ ఘటన జరిగినట్లు కాంట్రాక్టర్ వివరణ ఇచ్చాడని తెలిపారు. సున్నితమైన అంశంపై విపరీతమైన ప్రచారం జరగడంతో ఆలయ ఉద్యోగులు, రామ భక్తులు విచారం వ్యక్తం చేశారని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని వివరించారు.

శ్రీలక్ష్మీ గణపతి ఆలయలో యంత్ర ప్రతిష్ఠ



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు పార్వతి సమేత రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, నంది, ఉష్టవాహన, శిఖర, నాగ, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. గణపతి పూజ, గోపూజ, పుణ్యావాచనం, పంచగ్రవ్య ప్రాశన, రక్షాబంధనం, రుత్వికరణం, దీక్షాధారణం, యాగశాల ప్రవేశం అఖండ దీప స్థాపన నిర్వహించారు. సాయంత్రం పలు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మ్యూజియం.. చూద్దాం రండి..!

- ప్రజల ఆదరణ చూరగొంటున్న భద్రాచలంలోని గిరిజన మ్యూజియం
- ఏజెన్సీ కేంద్రంలో సరికొత్త ఆటవిడుపు
- రూ.కోటి నిధులు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- ఐటీడీఏ పీఓ రాహుల్‌కు ప్రశంసల వెల్లువ



ఆటలాడుతున్న చిన్నారులు



స్టాళ్లలో చెక్కబొమ్మలు, వెదురుతో చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ప్రజలు

భద్రాచలం: గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఐటీడీఏ పీఓ రాహుల్ తీసుకున్న నిర్ణయం, చేసిన కృషి సత్ఫలితాలను ఇచ్చింది. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియానికి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజాప్రతినిధుల ప్రశంసలు దక్కడంతో పాటు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నిధులను విడుదల చేస్తామని వెల్లడించింది. ఇలాంటి గిరిజన మ్యూజియాలను అన్ని ఐటీడీఏల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించడంతో పీఓ రాహుల్ కృషికి ఫలితం దక్కినట్లయింది.

ఫొటోలకు అనుమతి

గిరిజన మ్యూజియంలో గతంలో కేవలం వస్తువులు, పరికరాల సందర్శనకు మాత్రమే అనుమతించే వారు. ప్రస్తుతం పర్యాటకులు, వీక్షకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు కూడా అనుమతివ్వడంతో బారులుదీరుతున్నారు. విశాలంగా గిరిజన పల్లె తరహాలో ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో సెల్ఫీలు తీసుకునేందుకు, పుట్టినరోజు ఇతర పార్టీలను చేసుకునేందుకు అనువుగా ఉండటంతో ప్రజలు తరలివస్తున్నారు. వెదురుతో చేసిన సెల్ఫీ పాయింట్, రంగురంగుల విద్యుత్ అలంకరణ జత కూడాయి. గిరిజన వంటకాలు ఆహుతులను అలరిస్తున్నాయి.

ఏజెన్సీ కేంద్రంలో ఆటవిడుపు..

పిల్లలకు, యువతకు, పెద్దలకు ఆటవిడుపునకు కేంద్రంగా తీర్చిదిద్దటం అద్భుత ఫలితాలను ఇచ్చింది. పిల్లలకు పెడల్ బోటింగ్, పార్క్, యువతకు బాక్స్ క్రికెట్, పెద్దలకు ఇసుక వాలీబాల్, షటిల్ తదితర ఆటల సెంటర్లను ఏర్పాటు చేయడంతో పెద్ద ఆటవిడుపుగా మారింది. వారాంతం, సెలవు రోజుల్లో జాతరను తలపించేలా జనం వస్తున్నారు. ఏప్రిల్ 7న దీనిని గవర్నర్ మహదేవ్‌వర్మ ప్రారంభించగా, నాటి నుంచి ఇప్పటి వరకు 50 వేలకు పైగానే దీనిని సందర్శించారు.

విశ్వవ్యాప్తం చేయాలి



గిరిజన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విశ్వవ్యాప్తం చేయాలని రూపొందించిన గిరిజన మ్యూజియానికి ఇంత ఆదరణ లభించటం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లోని తాజ్ బంజారాలో జరిగిన కాన్ఫరెన్స్‌లో దీనిపై వివరించటం, మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్, న్యూఢిల్లీ రూ.కోటి నిధుల ప్రకటన, మంత్రి సీతక్క, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్‌ల సత్కారం.. గిరిజనులకు, అధికారులకు జరిగిన సన్మానంగా భావిస్తున్నా.

– బి.రాహుల్, పీఓ, ఐటీడీఏ భద్రాచలం

కేంద్రం నుంచి రూ.కోటి నిధులు

మ్యూజియం ప్రారంభమైన నాటి నుంచి సందర్శించిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పీఓ కృషిని ప్రశంసించారు. తాజాగా సందర్శించిన మంత్రి సీతక్క అన్నింటిని వీక్షించి పర్యాటకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రజాప్రతినిధుల సిఫార్సుతో భద్రాచలం గిరిజన మ్యూజియం అభివృద్ధికి మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ (మోట) న్యూఢిల్లీ నుంచి రూ.కోటి నజరాన ప్రకటన వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులను విడుదల చేస్తే ఐటీడీఏ మ్యూజియానికి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దవచ్చు. అరకు, అసోం ప్రాంతాల్లో మాదిరిగా భద్రాచలం ప్రత్యేకమైన గిరిజన కొమ్ము, కోయ నృత్యాలలో పర్యాటకులను భాగస్వాములను చేసే విధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కరకగూడెం: నాటుసారా తయారు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. విప్పలగుంపులో ఓ ఇంట్లో సారా తయారీకి ఉపయోగించే సుమారు 200 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. 9 మంది సారా తయారీ, విక్రయదారులపై కేసులు నమోదు చేసి, వారిని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కాంతయ్య ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ అష్రఫ్, సిబ్బంది ఆంజనేయులు, ధనజ్యోతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని సత్యనారాయణపురానికి చెందిన సైదులుపై అదే గ్రామానికి చెందిన యాకూబ్‌పాషా, సోని దాడి చేసి గాయపర్చారు. మంగళవారం జరిగిన ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హసీనా కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యం

పాల్వంచరూరల్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బట్టలు, ల్యాప్‌ట్యాప్‌ను సర్దుకుని ఓ విద్యార్థిని వెళ్లిపోయింది. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన ఓపెన్ డిగ్రీ చదువుతున్న విద్యార్థిని (19) మంగళవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని తండ్రి శ్రీహరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంపై మంగళవారం ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు. మాణిక్యారం గ్రామానికి చెందిన గడదాసు గణేశ్ బైక్‌పై పోలారం నుంచి మాణిక్యారం వెళ్తూ కొమరారంలో ఎదురుగా స్కూటీపై వస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలు తీవ్రంగా గాయపడగా.. ఆయన కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



కమలాపురం సదస్సులో రికార్డులు పరిశీలిస్తున్న వేణుగోపాల్

ములకలపల్లి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ములకలపల్లి మండలంలో తొలిరోజు కమలాపురం, రాచన్నగూడెం గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతులకు భూ సమస్యలు ఉంటే ఈ సదస్సుల్లో తప్పక దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ భూక్యా గన్యా, నాయబ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఆర్‌ఐలు సత్యావతి, భద్రు, మాజీ ఎంపీపీ మట్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ

కామేపల్లి: మండలంలోని పొన్నేకల్ బుగ్గ వాగు ఎత్తిపోతల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు ఇచ్చిన సమాచారంతో ఇరిగేషన్ డీఈఈ శంకర్‌నాయక్, ఏఈఈ రమేశ్ మంగళవారం పరిశీలించారు. కాగా, విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు చేయించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ వల్లభనేని అప్పారావు కోరారు.

పరిశుభ్రతతోనే మలేరియా నియంత్రణ



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ స్పందన

కరకగూడెం: పరిశుభ్రతతోనే మలేరియా నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా మలేరియా అధికారి స్పందన స్పష్టంచేశారు. మంగళవారం ఆమె కరకగూడెం పీహెచ్‌సీని సందర్శించి 'ఆశా డే'కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దోమల ద్వారా సంక్రమించే ఈ వ్యాధిని అరికట్టడంలో సిబ్బంది సేవలతో పాటు ప్రజల సహకారం ఉండాలని, ఇళ్ల చుట్టూ, ఇంటి లోపల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరిబొండాలు, పగిలిన కుండలు, పూలకుండీలు, డ్రమ్ములు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవితేజ, సబ్ యూనిట్ ఆఫీసర్ వీరస్వామి, హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, ఎంటీఎస్ అరుణ్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాను తరిమికొట్టాలి..



గొత్తికోయల నుంచి రక్తపూతలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

- ఇప్పటికే 20 కేసుల గుర్తింపు
- రాకపోకల వల్లే వ్యాధి వ్యాప్తి
- ముందస్తు చర్యలతోనే నివారణ

ఇల్లెందు: మలేరియా నివారణ కోసం ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించిన వారి వల్ల వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా మలేరియా వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించే సర్వే పూర్తి చేశారు. జ్వర పీడితుల నుంచి రక్తపూతలు సేకరించి పరీక్షించారు. గొత్తికోయగూడేల్లో ఉన్న వారే ఈ జ్వర పీడితులుగా తేలారు. వీరు తమ స్వగ్రామాలకు వెళ్లి తిరిగి వచ్చిన వారి నుంచి మలేరియా సోకినట్లు గుర్తించారు. వారికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. వచ్చే నెల 16 నుంచి మలేరియా నివారణ కోసం మందు పిచికారీ చేయించేందుకు ప్రణాళిక రూపొందించారు.

ఏడు మలేరియా సబ్ యూనిట్లు..

జిల్లాలో ఏడు మలేరియా సబ్ యూనిట్ సెంటర్లు ఉన్నాయి. ఒక్కో సెంటర్‌కు ఒక సబ్ యూనిట్ సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. జిల్లాలో మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ కార్యక్రమం రూపొందించి సబ్‌యూనిట్లకు చేరవేస్తారు. మలేరియా సబ్‌యూనిట్ సూపర్‌వైజర్ ద్వారా కిందిస్థాయిలోమలేరియా నివారణ కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. ఇల్లెందు యూనిట్ పరిధిలోసులానగర్(టేకులపల్లి), ఆళ్లపల్లి, రొంపేడు(సుదిమళ్ల), గుండాల పీహెచ్‌సీలు ఉన్నాయి.కొత్తగూడెం సబ్ యూనిట్ పరిధిలో కొత్తగూడెం, పెనగడప, సుజాతనగర్, చంద్రుగొండ, జూలూరుపాడు, ఎర్రగుంట, ఎంపీ బంజర సబ్ యూనిట్ పరిధిలో ఉల్వనూరు, ముల్కలపల్లి, పాల్వంచ, జగన్నాథపురం, ఎంపీ బంజర,అశ్వారావుపేట సబ్ యూనిట్ పరిధిలో వినాయకపురం, గుమ్మడివల్లి, దమ్మపేట, పట్వారీగూడెం, మణుగూరు సబ్ యూనిట్ పరిధిలోమణుగూరు, అశ్వాపురం, పినపాక, జానపేట, కరకగూడెం, భద్రాచటం సబ్ యూనిట్‌పరిధిలో భద్రాచలంటౌన్, నర్సాపురం,పర్ణశాల, దుమ్ముగూడెం, చర్ల పీహెచ్‌సీలు ఉండగా వీటి పరిధిలో 20 కేసులు నమోదయ్యాయి.

మలేరియా నివారణకు చర్యలు..



జిల్లాలో మలేరియా నిర్మూలన కోసం ప్రణాళికాయుతంగా చర్యలు చేపడతున్నాం. ఇప్పటికే గ్రామస్థాయిలో రక్తపూతలు సేకరించి పరీక్షించగా 20 కేసులు నమోదయ్యాయి. వారందరికీ వైద్యం అందిస్తున్నాం. ప్రస్తుతం మలేరియా అదుపులో ఉంది. నివారణకు తగు చర్యలు ముమ్మరం చేశాం.

–డాక్టర్ స్పందన, మలేరియా ప్రోగ్రాం అధికారి

ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

తీవ్రగాయాలతో నాలుగేళ్ల చిన్నారి మృతి

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని ఏదులాపురం క్రాస్ వద్ద ఆగి ఉన్న ఆటోను మంగళవారం లారీ ఢీకొట్టిన ఘటనలో కోసూరి బృంద(4) మృతి చెందింది. బృంద తండ్రి అప్పారావు కుమార్తెతో కలిసి ఏదులాపురం క్రాస్ వద్ద టీ తాగడానికి వచ్చాడు. అదే సమయాన ఆయన స్నేహితుడు కృష్ణ ఆటో వచ్చింది. దీంతో ముందు సీటులో కృష్ణ ఉండగా, బృందను వెనక సీటులో కూర్చోబెట్టి షాప్‌లో కూల్‌డ్రింక్ తీసుకురావడానికి వెళ్లాడు. అంతలోనే వరంగల్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ ఆటోను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బృంద, కృష్ణను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బృంద మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్కరాజు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో గోదావరి పరవళ్లు

లింక్ కెనాల్ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల



లింక్ కెనాల్ వద్ద పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఏన్కూరు: గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సీతారామ ఎత్తిపోతల పథకం సిద్ధమవుతోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో కీలకమైన రాజీవ్ కెనాల్ పనులు 8.86 కి.మీ.ల్లో 7.86 కి.మీ. మేర పూర్తయినందున, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వరావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందనుందని వెల్లడించారు. ఏన్కూరు సమీపాన రాజీవ్ కెనాల్(ఏన్కూరు లింక్ కెనాల్) పనులను మంగళవారం మంత్రి పరిశీలించి మాట్లాడారు. ఈనెల 10వ తేదీకల్లా కెనాల్ పనులు పూర్తి కానుండగా, పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. కాగా, సత్తుపల్లి, అశ్వరావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించేలా యాతాలకుంట టన్నెల్ నిర్మిస్తున్నామన్నారు. సాగర్ ద్వారా కృష్ణా జలాలు రావడానికి రెండు నెలల ముందుగానే ఖమ్మం జిల్లా రైతులకు గోదావరి జలాలు అందించాలన్నది తమ సంకల్పమని మంత్రి తెలిపారు.

సర్వేకే పరిమితమైన డబ్లింగ్ లైన్

ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోనున్న పలువురు

- ఐదు నెలల క్రితమే సర్వే, ఆపై మార్కింగ్
- ఇప్పటికీ పరిహారం ఊసెత్తని అధికారులు





రైల్వేలైన్ వెంట సర్వే చేస్తున్న ఉద్యోగులు (ఫైల్) (ఇన్‌సెట్) కారేపల్లి స్టేషన్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కారేపల్లి: డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా కొత్తగూడెం స్టేషన్ వరకు ఉన్న సింగిల్ ట్రాక్‌ను డబుల్ ట్రాక్‌గా నిర్మించేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈమేరకు కారేపల్లి మండలంలో కమలాపురం, గేటుకారేపల్లి, కారేపల్లి, గాంధీనగర్, చీమలపాడు, రేలకాయపల్లి గ్రామాల్లో భూసేకరణ కోసం సర్వే చేశారు. మండల వ్యాప్తంగా 54 ఎకరాలు అవసరమని గుర్తించగా, కారేపల్లి పరిధి సింగరేణి రెవెన్యూలో సుమారు 60 – 70 మంది నుంచి 11.35 ఎకరాల వ్యవసాయ భూమి సేకరించాలని ఉంటుందని నిర్ధారించారు. అలాగే, కారేపల్లిలో స్టేషన్ విస్తరణ, రెండో ప్లాట్ ఫామ్, అదనంగా రెండు ట్రాక్‌ల నిర్మాణానికి 20 కుటుంబాల నుంచి ఇళ్లు సేకరించాల్సి ఉంటుంది. ట్రాక్ నుంచి 45 మీటర్ల మేర వ్యవసాయ భూమి, స్టేషన్ పరిధిలో 65మీటర్ల భూమితో పాటు ఇళ్లు సేకరించేలా మార్కింగ్ సైతం వేశారు. ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిన రైల్వే అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు భూనిర్వాసితులకు సమాచారం ఇచ్చారు. ఆపై గ్రామసభలు నిర్వహించినా, ఇప్పటివరకు పరిహారంపై ప్రకటన చేయకపోవడంతో నిర్వాసితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాగు చేయాలా, వద్దా..?

డబ్లింగ్ లైన్ నిర్మాణ భూసేకరణ కోసం సర్వే చేపట్టి ఐదు నెలలు కావొస్తుండగా, పరిహారంపై స్పష్టత కోసం నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ సీజన్ మొదలుకావడంతో రైల్వే అధికారులు మార్కింగ్ చేసిన భూముల్లో పంట సాగు చేయాలా, వద్ద మీమాంస నెలకొంది. సింగరేణి రెవెన్యూ పరిధి మైదాన ప్రాంతంలో ఉండడంతో ఇక్కడి భూములకు మంచి ధర పలుకుతోంది. అయితే, వ్యవసాయి భూములు, ఇంటి స్థలాలకు మార్కెట్ ధర కంటే మూడు రెట్లు అదనంగా పరిహారంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇక ఇళ్లకు స్వభావం ఆధారంగా ధర నిర్ణయించి గ్రామసభలో తీర్మానం చేస్తారని సమాచారం. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో తెలియకున్నా పరిహారం స్పష్టత లేక, పంటల సాగుపై అవగాహన లేక నిర్వాసితులు ఎదురు చూపుల్లో గడుపుతున్నారు.

ఐదు రెట్లు ఇవ్వాలి..



రైల్వే లైన్ కింద భూమి కోల్పోతున్న మాకు పరిహారం చెల్లించాకే భూములు ఇస్తాం. నాకు ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిలో 1.08ఎకరాలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ ధర కంటే ఐదు రెట్లు అదనంగా ఇస్తే ఇంకో చోట పొలం కొనుక్కోవచ్చు.

– తొరగ రామస్వామి, కారేపల్లి

మా ఇల్లు కోల్పోతున్నాం..



మా ఇల్లు పూర్తిగా సేకరిస్తామని మార్కింగ్ పెట్టారు. ఐదు నెలలు దాటినా పరిహారం చెప్పడం లేదు. ఇంటి ఖరీదుతో పాటు పరిహారం చెల్లించడమేకాక స్థలం మంజూరు చేసి ఇల్లు నిర్మిస్తే బాగుంటుంది. అప్పుడే మాలాంట్లోకు న్యాయం జరుగుతుంది.

– కొమ్మూరి లక్ష్మి, కారేపల్లి

జాబితా పంపించాం..



సర్వే అనంతరం స్థానికుల అనుమానాలు నివృత్తి చేసి జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాక భూములకు ధర నిర్ణయించి పరిహారం చెల్లించేలా చూస్తాం. ఆతర్వాతే రైల్వే శాఖ భూములు, ఇళ్లను స్వాధీనం చేసుకుంటుంది.

– సంపత్‌కుమార్, తహసీల్దార్

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 39 మందికి జరిమానా

సూపర్‌బజార్(కొత్తగూడెం): మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో 39 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు మంగళవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌ఐలు జి.విజయ, తుంగ రాజేష్ కథనం ప్రకారం.. వాహనాలను తనిఖీ చేస్తుండగా పలువురికి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేశామని, ఇందులో 9 మంది మద్యం తాగినట్లు తేలడంతో కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు. మద్యం తాగినట్లు వారు మెజిస్ట్రేట్ ముందు ఒప్పుకోవడంతో జరిమానా విధించారని తెలిపారు. అలాగే కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌ఐ కె నరేష్ నేతృత్వంలో చేపట్టిన తనిఖీల్లో 30 మంది మద్యం తాగి వాహనాల నడుపుతున్నట్లు రుజువు కావడంతో కోర్టులో ప్రవేశపెట్టామని, వారు మద్యం సేవించినట్లు అంగీకరించడంతో అందరికీ జరిమానా విధించారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం, రేగుబల్లి వద్ద ఉన్న గోదావరినుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీఐ అశోక్ సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి రవాణాకు సిద్ధం చేస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని ఆనందపురం శివారులోని ముర్రేడు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది. మంగళవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.